క్లుప్తంగా

చెత్త నుంచి సంపద సృష్టించాలి



పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న ఆనందరావు

నందిగాం: గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలు, చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీల ఆదాయం పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా రిసోర్స్ పర్సన్ పేరాడ ఆనందరావు సూచించారు. మండల కేంద్రం నందిగాంలోని చెత్త సంపద కేంద్రంలో నందిగాం, టెక్కలి, మెళియాపుట్టి మండలాల పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరుచేయు విధానం, వాటి నుంచి ఎరువులు తయారు చేయడం గురించి తెలియజేశారు. ఎరువుల అమ్మకం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన



సమీక్ష నిర్వహిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించనున్న జామి జాతర ఏర్పాట్లను ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు గురువారం పరిశీలించారు. లక్షల మంది భక్తులు హాజరవ్వనున్న జాతరకు అధికారులు, నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ట్రాఫిక్, క్యూలైన్‌లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ నరసయ్య, సప్ప నవీన్ తదితరులు ఉన్నారు.

డీఎస్పీ పరిశీలన

జామి ఎల్లమ్మ జాతర సందర్భంగా ఎల్లమ్మ తల్లి గుడి, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఇంజినీరింగ్, శానిటేషన్ పనులను కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, కమిషనర్ నడిపేన రామారావులు సంయుక్తంగా పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఇతర అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న పిరియా విజయ

కంచిలి: మండలంలోని కొక్కిలిపుట్టుగ పంచాయతీ ఆముదాలపుట్టుగ గ్రామంలో జరుగుతున్న జామి ఎల్లమ్మ జాతరలో జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ గురువారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గంగా సాహు, దేవరాజ్ సాహు, భాస్కర్ మజ్జి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉత్సవాల్లో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు లద్దుకేశవపాత్రో, స్థానిక నేతలు గంగాసాహు, భాస్కర్ మజ్జి పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

కంచిలి: డ్వాక్రా సంఘాల సభ్యులు తాము తయారు చేస్తున్న ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసుకోవడానికి రూపొందించిన యాప్‌పై అవగాహన పెంచుకోవాలని స్థానిక ఐకేపీ ఏపీఎం పి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని కంచిలి, ఎస్‌ఆర్‌సీపురం గ్రామాల్లో డ్వాక్రా సంఘాలతో గురువారం సమావేశమయ్యారు. ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ ఫర్ కామర్స్ ద్వారా ఆన్‌లైన్‌లో సంబంధిత ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సమావేశంలో సీసీలు, వీవోఏలు, సంఘాల ఆర్గనైజర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మన ఇల్లు మన గౌరవం' పథకంలో భాగంగా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘానికి సంబంధించి రామకృష్ణాపురం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతి న పూర్తి చేయాలని కమిషనర్ నడిపేన రామారావు సూచించారు.పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో రామకృష్ణాపురం లే అవుట్ ప్రత్యేకాధికారి బి.రమణమూర్తితో గురువారం సమావేశమయ్యారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కూరగాయల పంటలు

కూరగాయల సాగుకు కేరాఫ్..!

- ఏడాదంతా పండిస్తున్న పలాస పెద్దవీధి
- సాగుతోనే ప్రజల జీవనాధారం
- నేరుగా విక్రయిస్తూ లాభాలు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పలాస పెద్దవీధికి చెందిన సుమారు వంద కుటుంబాలు కూరగాయల సాగుకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. ఏడాదంతా ఉద్యానవన పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాయి. వీరంతా ఒకప్పుడు గంజాం జిల్లాలోని అగ్ర కులస్తులు. కాలక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఏర్పడిన తర్వాత పలాస నడిబొడ్డున ఉండే సుమారు 20 ఎకరాల్లో వ్యవసాయం చేసుకొని ఇక్కడే స్థిరపడ్డారు. చిన్న చిన్న కమతాల్లో కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నారు. అక్కడ ప్రస్తుతం భూమి ధరలు ఆకాశాన్ని అంటుతున్నా, వీరు మాత్రం వ్యవసాయమే ఆధారంగా చేసుకొని బతుకుతున్నారు. ఆ భూములు అమ్ముకోవడానికి మాత్రం ఇష్టపడడం లేదు. అలాగే చుట్టూ జీడి పరిశ్రమలు ఉన్నా, అక్కడ పనిచేయడానికి ఇష్టపడరు.



సాగు చేస్తున్న కూరగాయల పంటలు

భలే గిరాకీ

పలాస పెద్దవీధి ప్రజలు పండిస్తున్న ఈ కాయగూరలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుంది. పలాస-కాశీబుగ్గ పట్టణాలతో పాటు గ్రామాల్లో ఈ కాయగూరలు ఉదయం పూట దొరుకుతాయి. ఇంటిల్లిపాటి ఈ పంటలను పండించడమే కాకుండా, వారే నేరుగా గ్రామాల్లోకి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. వీరు తెచ్చిన ఈ తాజా కాయగూరలు వెంటవెంటనే అమ్ముడుపోతాయి.

వైఎస్సార్ మేలు

గతంలో అగ్ర కులస్తులుగా ఉన్న వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందేవి కావు. అయితే 2004లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరిని బీసీ జాబితాలో చేర్చారు. అనంతరం వారి పిల్లలకు అవకాశాలు లభించాయి. ప్రస్తుతం విద్యాపరంగా అనేక సదుపాయాలను అందుకుంటున్నారు.

అన్ని కాలాల్లోనూ పండిస్తున్నాం



అన్ని కాలాల్లోనూ పంటలను పండిస్తున్నాం. ఇదే మాకు జీవనాధారం. ఇప్పటివరకు ప్రభుత్వాలు సహకరిస్తున్నాయి. ఇంకా గిట్టుబాటు ధర రావాలంటే కూరగాయల అమ్మకాలకు రైతు బజారు పెడితే బాగుంటుంది.

– మదన్‌బెహరా, పెద్దవీధి, పలాస

కుటుంబమంతా కష్టపడతాం



మా కుటుంబంలో అందరం కలిసి కష్టపడతాము. కష్టానికి తగిన ఫలితం రాకపోయినా ఇదే మా వృత్తి. దీన్ని వదలుకోవాలని అనుకోవడం లేదు. మేము గ్రామాల్లోకి వెళ్లి అమ్ముతుంటాము. ఏ రోజు కాయగూరలు ఆ రోజు అమ్ముడు పోతుంటాయి. డిమాండు బాగానే ఉంటుంది.

– కౌశల్య పాత్రో, పెద్దవీధి, పలాస

సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానవన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. బోర్‌వెల్స్ ఉన్నాయి. మోటార్లకు సబ్సిడీ ఇచ్చారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అలాగే పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– శంకర్‌దాస్, ఉద్యానవన అధికారి, పలాస

ఇన్‌స్పైర్ అవార్డులకు నలుగురు ఎంపిక



అవార్డులకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయ సిబ్బంది

కవిటి: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ అవార్డులకు కవిటి మండలం రాజపురం బాలికోన్నత పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం లాభాల వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఎంపికైన సాడి వర్ష, అనింగి తులసి, పొడియా సుశీల, లొట్టి జయలక్ష్మిలను పాఠశాలలో గురువారం అభినందించారు. గతేడాది కూడా ఈ పాఠశాల నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి వరుసగా రెండేళ్లు విద్యార్థులు ఎంపికవ్వడంపై ఎంఈవో ధనంజయ మజ్జి హర్షం వ్యక్తం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సోంపేట: విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లవరాజు

నందిగాం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి అన్నారు. మండల కేంద్రమైన నందిగాంలో మహిళా దినోత్సవ అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామంలో మహిళలకు మహిళా దినోత్సవం ఆవశ్యకతను తెలియజేశారు. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను వివరించారు. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి పరిష్కారాలపై అవగాహన కల్పించారు.



నందిగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని సోంపేట ఎస్‌ఐ లవరాజు సూచించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోంపేట పోలీస్‌స్టేషన్‌లో డిగ్రీ విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో అందుతున్న సేవలు, నిర్వహిస్తున్న విధులు గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



సోంపేట: లోకనాథంను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త బుద్దాన లోకనాథంను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ గురువారం పరామర్శించారు. ఇటీవల లోకనాథం ప్రమాదవశాత్తు గాయపడడంతో ఆయన బాగోగులు తెలుసుకున్నారు. వారితో పాటు మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ తదితరులు ఉన్నారు.



శిబ్బో బెహరాతో మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని పి.శాసనాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణచంద్ర బెహరా చిన్న కుమారుడు శిబ్బో బెహరా ఇటీవ ల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో పలాసలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి స్థానిక సర్పంచ్ గుడ్డిపద్ర వేణుతో కలిసి గురువారం పలాస వెళ్లి శిబ్బో బెహరాను పరామర్శించా రు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పార్టీ నేత డొక్కరి బలరాం ఉన్నారు.

పక్కాగా పనులు చేపట్టాలి

కంచిలి: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో వి.తిరుమలరావు సూచించారు. మండలంలోని జలంత్రకోట పంచాయతీ పరిధిలో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. పనుల్లో కొలతల ఆధారంగా వేతనదారులకు వేతనాలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని క్షేత్ర సహాయకులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆయనతో పాటు ఏపీవో జి.ధనుంజయ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలరావు

బీమా చెక్కు అందజేత

సోంపేట: మండలంలోని బారువ గ్రామానికి చెందిన జవాన్ తెలుకుల శ్రీకాంత్ ఇటీవల బారువ సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బారువ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాంత్ తల్లిదండ్రులకు బారువ స్టేట్ బ్యాంకు బ్రాంచి ద్వారా రూ.50 లక్షల బీమా చెక్కును గురువారం బ్రాంచి ఆవరణలో అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ బి.రమేష్, ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

టెక్కలి: అన్ని గ్రామాల్లోనూ సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకరరావుతో పాటు దళిత సంఘాల జేఏసీ నాయకులు ఎం.కృష్ణయ్య, డి.గణేష్, బి.ధనరాజ్, టి.రమణ తదితరులు కోరారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్.రాంబాబు, ఎస్.రాజు పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తే ఉత్తమ ఫలితాలు

సోంపేట: పరీక్షల్లో ఒత్తిడి జయిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఎర్రముక్కాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అల్లాడ అనంత్ అన్నారు. పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు వేటు సక్సెస్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా కిట్లు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ బైపల్లి ఈశ్వరి, వేటు సక్సెస్ సంస్థ వ్యవస్థాపకుడు చిడిపల్లి దామోదరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కంచిలి: మండలంలో కొక్కిలిపుట్టుగ పంచాయతీ పరిధిలోని జామి ఎల్లమ్మ ఆలయం అభివృద్ధికి స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి రూ.20 వేల విరాళాన్ని అందజేశారు. ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు హాజరైన ఆమె ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీకి గురువారం అందించారు.

21వ రోజుకు చేరుకున్న కార్మికుల సమ్మె

కాశీబుగ్గ: మందస మండలంలోని మందస, సిద్దూరు పరిధి రైస్ మిల్లుల కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా ప్రతీ రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పందం జరుగుతుందని, 2024 జూన్ నాటికి రెండేళ్ల ఒప్పందం పూర్తవ్వడంతో నూతన ఒప్పదం చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు రైస్ మిల్లుల యాజమాన్యాల పక్షానే నిలబడి కార్మికులను దగా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైస్‌మిల్ కార్మిక సంఘ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దూరు వద్ద ధర్నా చేస్తున్న రైస్‌మిల్ కార్మికులు

జామి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఇచ్ఛాపురం: పట్టణంలోని బెల్లుపడ రోడ్డులో ఉన్న ఎల్లమ్మ గుడివద్ద శుక్రవారం జరగనున్న జామి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో చక్కగా అలంకరించారు. యాత్రలో భాగంగా ఎల్లమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అయితే యాత్ర నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలియజేశారు. జాతీయ రహదారి మీదుగా వచ్చే బస్సులు వంటి పెద్ద వాహనాలు బెల్లుపడ – ఈదుపురం కూడలి మీదుగా కాకుండా, బోర్డర్ ఏఎస్‌పేట మీదుగా పట్టణంలోకి చేరుకోవాలని సూచించారు. ఆదేవిధంగా యాత్రకు వచ్చే భక్తుల వాహనాలకు సమీపంలోని శ్రీసురంగిరాజా క్రీడా మైదానం ఆవరణలో పార్కింగ్ సదుపాయం కల్పించినట్లు తెలియజేశారు. ఆంక్షలు అతిక్రమించి ఎవరైనా రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్క్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



యాత్రకు ముస్తాబైన ఎల్లమ్మ గుడి

ఆధార్ నంబర్ నమోదు చేయాలి

ఇచ్ఛాపురం టౌన్: ప్రభుత్వ సామాజిక ఆస్పత్రులకు వచ్చే రోగుల అధార్ నంబర్‌ను పక్కాగా నమోదు చేయాలని వైద్యాధికారి డాక్టర్ దేవేందర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి వచ్చే ఆదేశాల మేరకు ప్రతీ రోగి పూర్తి వివరాలు నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనివలన రోగి ఆరోగ్య సమస్యలు, ప్రస్తుత పరిస్థితిపై పూర్తి స్థాయి సమచారం అందుబాటులో ఉంటుందన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రమాదకరం



అధిక లోడ్‌తో ప్రమాదాలు జరుగుతున్నా కొంతమందిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. టెక్కలిలోని పలు వీధుల్లో సేకరించిన చెత్తను అధిక ధరలకు అమ్మేందుకు బస్తాల్లో నింపి వాటిని నిత్యం ఇలా ప్రమాదకరంగా తరలిస్తున్నారు. అయితే ఒకవేళ జాతీయ రహదారిపై కట్టుజారితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చునని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమన్వయంతో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వి.ల్యూక్‌పాల్, ఆస్పత్రి రక్తనిధి కేంద్రం వైద్యురాలు బి.సునీత, సిబ్బంది డి.విజయ్, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.వాసుబాబు, కె.గొల్ల, రెడ్ రిబ్బన్ కో-ఆర్డినేటర్ సీహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

– టెక్కలి

జానపదం ఝుల్లుమన్నదీ



కవిటి మండలంలోని బెజ్జిపుట్టుగ చక్రధర పెరుమాళ్ ఆలయం కళా వేదికలో జానపద ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. గురువారం డోలోత్సవాల ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన జానపద గీతాలు, తప్పెటగుళ్ల ప్రదర్శనలు, జుగల్‌బందీ గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులంతా కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి.కృష్ణారావు, పి.శ్రీరాంబాబు, సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి, విశ్రాంత వీఆర్వోలు గొండ్యాల రాముర్తి, బి.జగన్నాథ, బి.మోహనరావు, శమళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

– కవిటి